క్లుప్తంగా

గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరచాలి



రేపల్లె రూరల్: స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామాలలో పారిశుద్ధ్య కార్యక్రమాలు మెరుగుపరచాలని డీఎల్‌పీఓ శ్రీనివాసస్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులు నిత్యం గ్రామాల్లో అందుబాటులో ఉండి పారిశుద్ధ్య కార్యక్రమాలు పర్యవేక్షించాలన్నారు. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున ప్రతి పంచాయతీలో నూరుశాతం ఆస్తి, నీటి పన్నులు వసూలు చేయాలన్నారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు వహించాలని ఆదేశించారు. పలు అంశాలపై సమీక్షించారు. సమావేశంలో ఈవోపీఆర్డీ వీవీడీవీ ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా పొన్నమాను ఉత్సవం



భట్టిప్రోలు: భట్టిప్రోలులో కొలువైన భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం బిందె తీర్థం, అభిషేకం, నిత్యహోమం, బలిహరణ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి పొన్నమాను ఉత్సవం కనుల పండువగా సాగింది. ఈ కార్యక్రమాన్ని తిరువీధుల బాలాజీ, శ్రీధర్‌లు పర్యవేక్షించారు. బుధవారం రాత్రి స్వామి వారి ఆలయంలో జగజ్యోతి, ఆ తరువాత ఎదురుకోల మహోత్సవం వైభవంగా జరగనుంది. అద్దేపల్లి – భట్టిప్రోలు పద్మశాలీయ బహూత్తమ సంఘం వారిచే స్వామివారి కల్యాణానికి తలంబ్రాల బియ్యం, మెట్టెలు, మంగళ సూత్రాలు సమర్పిస్తారు. ఉత్సవాలలో ప్రధాన ఘట్టమైన దివ్య రథోత్సవం గురువారం సాయంత్రం జరుగనుంది. కార్యక్రమాలను కార్యనిర్వాహణాధికారి, రేపల్లె ఇన్‌స్పెక్టర్ శనగవరపు కుమార్‌బాబు, ఫౌండర్ ట్రస్టీలు, వంశపారంపర్య ధర్మకర్తలు, అద్దేపల్లి – భట్టిప్రోలు పద్మశాలీయ బహూత్తమ సంఘీయులు పర్యవేక్షిస్తున్నారు.

నేటి నుంచి పునఃప్రతిష్టా మహోత్సవాలు



గొరిగపూడి(భట్టిప్రోలు): భ్రమరి దుర్గాదేవి సమేత శ్రీ నాగేశ్వరస్వామి దేవస్థానం జీవధ్వజ విమాన గోపుర శిఖర సహిత పునః ప్రతిష్టా మహోత్సవం బుధవారం నుంచి ఈ నెల 16వ తేదీవరకు ఘనంగా నిర్వహించనున్నట్లు సర్పంచ్ గరిగపాటి మల్లికా వెంకటేశ్వరరావు, ఆలయ అర్చకులు ఆమంచి సృజన్ కుమార్, కార్యనిర్వాహణాధికారి పాపని రాజేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా స్వామివార్ల ఆలయ పునఃప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా పెదపులివర్రు గ్రామంలో స్వయంభువుగా కొలువైన బాలా త్రిపుర సుందరి సమేత రాజరాజ నరేంద్ర స్వామివారి ఆలయం నుంచి శ్రీ నాగేశ్వర స్వామి వారికి శివలింగం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గొరిగపూడిలోని ఉత్సవ మూర్తులను పెదపులివర్రు నుంచి పసుపు కుంకుమతో గ్రామోత్సవంగా గ్రామ దేవత శ్రీ దేశమ్మ తల్లికి తరలి వెళ్లి ప్రత్యేక పూజలు జరిపి పసుపు, కుంకుమ చీర సారె సమర్పించారు.

అంగన్‌వాడీల నిర్బంధం నిరంకుశత్వానికి నిదర్శనం

ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి



భట్టిప్రోలు (కొల్లూరు): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్‌వాడీలకు న్యాయం చేస్తామని హామీలు ఇచ్చి నేడు వారి గోడు వినిపించకుండా ఎక్కడికక్కడ నిర్బంధించడం నిరంకుశత్వానికి నిదర్శనం అని భట్టిప్రోలు ఎంపీపీ, నియోజకవర్గ అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలు దావూరి వెంకట లలితకుమారి విమర్శించారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ, అంగన్‌వాడీల న్యాయబద్ధమైన డిమాండ్లు నెరవేర్చకుండా వారి గొంతు నొక్కి ఆందోళనలను అణచివేయడం కూటమి ప్రభుత్వ నియంత చేష్టలకు పరాకాష్ట అన్నారు. అంగన్‌వాడీలను తక్షణం పిలిచి ప్రభుత్వం చర్చించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలకు నెలకు గౌరవ వేతనం రూ.26వేలు ఇవ్వాలని, మిగిలిన హామీలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఉపయుక్తంగా లేవు!

- అద్దె గృహాల్లో ఆరోగ్య ఉప కేంద్రాలు
- చాలీచాలని గదుల్లో అరకొర వైద్యసేవలు
- మండలంలో 8 కేంద్రాలు
- ఒక్కచోటే సొంత భవనం..
- సొంత స్థలాలు ఉన్నా భవనాలు లేక ఇబ్బందులు



కొల్లూరు బాలికోన్నత పాఠశాల వద్ద పాడుపడి నిరుపయోగంగా ఉన్న ఆరోగ్య ఉపకేంద్ర భవనం



కొల్లూరు ఎస్సీ కాలనీలో విష సర్పాలకు ఆవాసంగా ఆరోగ్య ఉపకేంద్రం భవనం

కొల్లూరు: కూటమి ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు మృగ్యమవుతున్నాయి. మండలంలోని ఆరోగ్య ఉపకేంద్రాలు శిథిలావస్థకు చేరడంతో అద్దె గృహాల్లో కొట్టు మిట్టాడుతున్నాయి. పల్లెవాసులకు ఆరోగ్య సేవలు అందించేందుకు అరకొర వసతులతో అద్దె ఇళ్లలో ఉన్న ఉపకేంద్రాలు ప్రాథమిక వైద్యం సైతం అందించడానికి పనికిరాకుండా పోతున్నాయి.

విష సర్పాలకు నిలయం..

కొల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 8 ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలు ఉన్నాయి. ఒక్క చింతర్లంక గ్రామంలో మాత్రమే ఉపకేంద్రానికి సొంత భవన సదుపాయం ఉంది. కొల్లూరు ఎస్సీ కాలనీలో ఉన్న భవనం ఆలనా పాలనా పట్టించుకునేవారు కరువవడంతో వాడడానికి పనికిరాని స్థితికి చేరుకొని, విష సర్పాలకు ఆవాసంగా మారడటంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. కొల్లూరు లాక్ సెంటర్ ప్రాంతంలో గతంలో ఉన్న పాత ఆరోగ్యకేంద్రంలో ఉప కేంద్రం నిర్మించాలన్న ప్రతిపాదనలు బుట్ట దాఖలవడంతో అద్దె ఇంటిలోనే కేంద్రం నిర్వహణ కొనసాగుతుంది.

- మండలంలోని ఆవులవారిపాలెంలో సైతం శిథిలావస్థకు చేరుకున్న భవనం ప్రమాదకరంగా మారడంతో దానిని కూల్చివేసినప్పటికీ నూతన ఆరోగ్య ఉపకేంద్రం నిర్మాణ పనులు మాత్రం ప్రారంభమవలేదు. పంచాయతీ కార్యాలయాల్లో చాలీచాలని గదుల్లో కొన్ని ప్రాంతాల్లో కేంద్రాల నిర్వహణ కొనసాగుతుండగా, అద్దె ఇళ్లలో ఉన్న కేంద్రాలు అద్దె ప్రాతిపదికన కొనసాగుతున్నాయి. ఏడాదికోసారి ప్రభుత్వం అద్దె చెల్లింపులు చేస్తుండగా, ప్రభుత్వం అద్దె చెల్లింపులు జరిపే వరకూ ఏఎన్‌ఎంలు తమ జీతాల నుంచి అద్దె చెల్లింపులు చేపట్టాల్సి వస్తుంది. దీంతో వారు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అన్యాక్రాంతమవుతున్న స్థలాలు

ఆరోగ్య ఉపకేంద్రాలు శిథిలావస్థకు చేరుకొని నిరుపయోగంగా మారడంతో ఆ స్థలాలు అన్యాక్రాంతమవుతున్నాయన్న ఆందోళన ప్రజల్లో నెలకొంది.

నిర్మాణాలకు ప్రతిపాదనలు అడగలేదు

ఆరోగ్య ఉపకేంద్రాల నిర్మాణాలకు ఇటీవల కాలంలో ఎటువంటి ప్రతిపాదనలు పంపాలని ఉన్నతాధికారాల నుంచి ఆదేశాలు అందలేదు. కొల్లూరులో రెండు ఉపకేంద్రాలు శిథిలావస్థలో ఉండటంతో పాటు, మిగిలిన ఉపకేంద్రాలు అద్దె భవనాలలో కొనసాగుతున్నాయి. రెండు, మూడు ప్రాంతాలలో పంచాయతీ కార్యాలయాలు, కమ్యూనిటీ భవనాలలో కొనసాగిస్తున్నాం. ఒక్కో ఆరోగ్య ఉపకేంద్రానికి అద్దె రూ.2 వేలు, విద్యుత్తు బిల్లు రూ. 200 కలిపి మొత్తం మీద రూ. 2,200 వరకు చెల్లింపులు జరుగుతున్నాయి.

– వి.కావ్యతేజ, పీహెచ్‌సీ వైద్యాధికారిణి, కొల్లూరు

ఉపకేంద్రాలకు స్థలాలు ఉన్న ప్రాంతాలలో సైతం భవన నిర్మాణాలు చేపట్టకుండా పాడుబడిన భవనాలను వదిలివేయడంతో ఆ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయన్న వాదన వ్యక్తమవుతుంది. అనంతవరంలో ఆరోగ్య ఉపకేంద్ర నిర్మాణం కొంత భాగం పూర్తయినప్పటికీ అక్కడ నుంచి పనులు చేపట్టకుండా నిలిచిపోవడంతో పంచాయతీ కార్యాలయంలోని చిన్నపాటి గదిలో వైద్య సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. సొంత స్థలాలు ఉన్న చోట్ల భవనాల నిర్మాణాలు చేపట్టాలని ప్రతిపాదనలు పంపినప్పటికీ ఆచరణకు నోచుకోకపోవడంతో స్థలాలు వృథాగా పడిఉన్నాయి. దీంతో కబ్జాదారుల కన్ను వాటిపై పడే అవకాశం లేకపోలేదు. ప్రభుత్వ అధికారులు, వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది స్పందించి ఆరోగ్య ఉపకేంద్రాల నిర్మాణాలు చేపట్టి ప్రజలకు మెరుగైన ఆరోగ్యాన్ని అందుబాటులోకి ప్రజలు తీసుకురావాలని కోరుతున్నారు.

విద్యార్థులు, నిరుద్యోగులకు అండగా వైఎస్సార్ సీపీ

- మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి
- యువతపోరు వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ



యువత పోరు వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కోన రఘుపతి

బాపట్ల: విద్యార్థులకు, నిరుద్యోగులకు అండగా వైఎస్సార్ సీపీ యువత పోరు కార్యక్రమాన్ని చేపట్టిందని పార్టీ బాపట్ల ఇన్‌చార్జి, మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి పేర్కొన్నారు. బుధవారం స్థానిక రథం బజారులోని వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు చేరుకుని జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తామని కోన చెప్పారు. ఈకార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి మేరుగ నాగార్జున పాల్గొంటారని తెలిపారు. మంగళవారం స్థానిక కోన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కోన రఘుపతి మాట్లాడారు. హాస్టల్ ఫీజులు రాక, ఫీజురీయింబర్స్‌మెంట్ చెల్లించక విద్యార్థులను కూటమి ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. కోన పేర్కొన్నారు. ఫీజులు చెల్లించలేక తల్లిదండ్రులు తీవ్ర మానసిక ఒత్తిళ్లకు గురవుతున్నారని తెలిపారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పుడు ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో చెల్లించటం జరిగిందన్నారు. పాతబకాయిలు చెల్లించి మరీ రీయింబర్స్‌మెంట్‌ను అమలు చేశారని తెలిపారు. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల్లోనే రూ.24కోట్లు ఒక ఏడాదికి ఫీజు రీయింబర్స్‌మెంట్ జమ చేశారంటే పాలన ఎలా ఉండేదో అర్థం చేసుకోవాలన్నారు. యువత పోరులో విద్యార్థులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొనాలని కోరారు.

నేడు పార్టీ ఆవిర్భావ దినోత్సవం

వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం బుధవారం రథం బజారులోని పార్టీ కార్యాలయంలో జరుగుతుందని కోన రఘుపతి తెలిపారు. ఉదయం 10గంటలకు పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తామని చెప్పారు. పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, మరుప్రోలు కొండల రెడ్డి, ఉయ్యూరు లీలా శ్రీనివాసరెడ్డి, జిల్లా యూత్ అధ్యక్షుడు కొక్కిలిగడ్డ చెంచయ్య, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు సోహిత్, నాయకులు కోకి రాఘవ రెడ్డి, కటికల యోహోషువా, జోగి రాజా,మోర్ల సముద్రాలగౌడ్,ఉరబిండి గోపియాదవ్ ఉన్నారు.

యువత పోరుకు తరలిరావాలి



చెరుకుపల్లిలో యువతపోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

చెరుకుపల్లి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా విద్యార్థులను, నిరుద్యోగ భృతి విడుదల చేయకుండా నిరుద్యోగులను మోసం చేసిందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుండి వెంకట రామిరెడ్డి పేర్కొన్నారు. రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ ఆదేశాల మేరకు పార్టీ మండల కార్యాలయంలో మంగళవారం నాయకులతో కలసి యువత పోరు పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. బుధవారం బాపట్ల కలెక్టరేట్ వద్ద జరిగే యువత పోరు కార్యక్రమానికి మండలంలోని నాయకులు, కార్యకర్తలు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు గాలిమోటు రాజశేఖర్, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు సత్యన్నారాయణ, నడింపల్లి సర్పంచ్ సుబ్బారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి పాలనలో విద్యావ్యవస్థ నిర్వీర్యం



రేపల్లెలో పోస్టర్‌లను విడుదల చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రేపల్లె రూరల్: విద్యావ్యవస్థను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ కరేటి శేషగిరిరావు ఆరోపించారు. ఈ నెల 12న బాపట్లలో జరిగే యువత పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం పట్టణంలోని 23వ వార్డులో వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరించారు. యువత పోరు కార్యక్రమంలో యువత, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీనివాసరావు, చిత్రాల ఓబేదు, చిమటా బాలాజీ, కేవీ కృష్ణారెడ్డి, సముద్రాల ప్రభుకిరణ్, కర్రా రత్నాకర్, వీసం నాగలక్ష్మి, అబ్దుల్ ఖుద్దూష్, లియాకత్ బాషా, కొలుసు బాలకృష్ణ, పట్టెం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు

వైఎస్సార్ సీపీ వేమూరు సమన్వయకర్త వరికూటి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వరికూటి అశోక్‌బాబు, నాయకులు

వేమూరు: ప్రభుత్వం విద్యార్థులకు ఫీజ్ రీయింబర్స్‌మెంట్ వెంటనే చెల్లించాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు డిమాండ్ చేశారు. అమృతలూరు మండలంలోని ప్యాపర్రులో మంగళవారం యువత పోరు పోస్టర్లను ఆయన నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన యువత పోరు బాటకు విద్యార్థులు, అధిక సంఖ్యలో కదిలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు. సీఎం చంద్రబాబు హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నప్పటికీ, ఒక్క హామీ కూడా అమలు చేయలేదన్నారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తామంటూ హామీలిచ్చి నెలలు గడుస్తున్నా ఇంతవరకు చెల్లించలేదని దీంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గంలోని వేమూరు, కొల్లూరు, అమృతలూరు, భట్టిప్రోలు, చుండూరు మండలాల నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్దకు తరలిరావాలని ఆయన కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు దాది సుబ్బారావు, శ్రీనివాసరావు, సుగ్గున మల్లేశ్వరరావు, అన్నవరపు రఘురామరెడ్డి, జి.శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సెల్ఫ్ సర్టిఫికేషన్‌తో నిర్మాణాలకు అనుమతులు సులభం

టౌన్ ప్లానింగ్ విభాగం ఆర్‌జేడీ మధుకుమార్



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్‌జేడీ మధుకుమార్

రేపల్లె రూరల్: భవన నిర్మాణాల కోసం అనుమతులు సులభతరం చేసేందుకు ప్రభుత్వం నూతన విధానాన్ని అమలు చేస్తోందని టౌన్‌ప్లానింగ్ విభాగం ఆర్‌జేడీ మధుకుమార్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా పట్టణంలోని టౌన్‌ప్లానింగ్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించి మాట్లాడారు. సెల్ఫ్ సర్టిఫికేషన్ పథకం అనే నూతన విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. పథకం ద్వారా భవన నిర్మాణాల అనుమతుల కోసం వినియోగదారులు లైసెన్స్ కలిగిన ఇంజినీర్ నుంచి దరఖాస్తు చేసుకుంటే వెంటనే అనుమతులు లభిస్తాయన్నారు. గతంలో భవన నిర్మాణ అనుమతుల కోసం వినియోగదారులు రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తుందన్నారు. ఆ విధానానికి స్వస్తి పలుకుతూ అమలు చేస్తున్న సెల్ఫ్ సర్టిఫికేషన్ పథకాన్ని పట్టణంలోని ప్రజలు వినియోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన వెంట గుంటూరు టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ పూర్ణచంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మినుములు, పెసలు కొనుగోలు చేస్తాం

వ్యవసాయ సహాయ సంచాలకులు ఆర్.విజయ్‌బాబు

రేపల్లె రూరల్: రబీ సీజన్‌లో రైతులు సాగుచేసిన మినుము, పెసలు కొనుగోలుకై జిల్లా కలెక్టర్ నుంచి ఉత్తర్వులు అందినట్లు వ్యవసాయ సహాయ సంచాలకులు ఆర్.విజయ్‌బాబు తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని నల్లూరు, అరవపల్లి గ్రామాలలో సాగు భూములను మంగళవారం ఆయన పరిశీలించారు. రైతు సేవా కేంద్రాల ప్రథమ కొనుగోలు కేంద్రాలుగా గుర్తించి సొసైటీల ద్వారా మినుము, పెసలును ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ప్రకారం కొనుగోలు చేస్తామన్నారు. మినుములు క్వింటాకు రూ.7400లు, పెసలు క్వింటాకు రూ.8682ల చొప్పున కొనుగోలు చేస్తామని, ఆసక్తి కలిగిన రైతులు రైతుసేవా కేంద్రాలలో సంప్రదించాలన్నారు.

వేమూరు(అమృతలూరు): రైతులు పెసర దిగుబడులు విక్రయించుకునేందుకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు మార్క్‌ఫెడ్ మేనేజర్ కరుణశ్రీ అన్నారు. మంగళవారం మండలంలోని ప్యాపర్రు, బోడపాడు గ్రామాలలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ, బోడపాడు పీఏసీఎస్‌లో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి మద్దతు ధరకు కొనుగోళ్లు చేయడం జరుగుతుందన్నారు. పెసలు అమ్ముకోదలిచి ఈ–క్రాప్ బుకింగ్ చేసుకున్న రైతులు ఆధార్, పాసుపుస్తకం, బ్యాంక్ పాసుపుస్తకం నకళ్లు తీసుకొని కొనుగోలు కేంద్రాలలో సంప్రదించాలని కోరారు. బాపట్ల సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎ.లక్ష్మి రైతులుకు పలు సూచనలు సలహాలు అందజేశారు. వ్యవసాయ విస్తరణాధికారి జె.శ్రీకాంత్, వ్యవసాయ సహాయకురాలు డి.లక్ష్మి పాల్గొన్నారు.

డ్రోన్‌తో పేకాట రాయుళ్ల ఆటకట్టు

10 మంది జూదరులు అరెస్టు



డ్రోన్ సాయంతో కనుగొన్న పేకాట శిబిరం ఆచూకీ

చుండూరు (వేమూరు): చట్ట వ్యతిరేక కార్యకలాపాలను అరికట్టేందుకు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని పోలీసు శాఖ వినియోగిస్తూ జూదరులపై మూకుమ్మడి దాడి చేసిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. చుండూరు మండలంలోని యడ్లపల్లి ప్రాంతంలో మారుమూల పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారంతో ఎస్ఐ రహిమాన్ జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాలతో దాడులకు సమాయత్తమయ్యారు. ఆప్రదేశానికి చేరుకున్న పోలీసులకు నిమ్మతోటలతో కూడిన మారుమూల ప్రదేశాన్ని గుర్తించడం కష్టతరమవడంతో వారి ఆచూకీ తెలుసుకునేందుకు డ్రోన్‌ను వినియోగించారు. పేకాట ఆడుతున్న ప్రాంతంలో డ్రోన్ విహరిస్తూ వీడియోలు, ఫొటోలు తీస్తుండటం గుర్తించిన జూదరులు పారిపోయే ప్రయత్నం చేశారు. అప్పటికే ఆప్రాంతాన్ని గుర్తించిన పోలీసులు 10 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు.

వైభవంగా వరదరాజ స్వామి బ్రహ్మోత్సవాలు



భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం పెదపులివర్రులో కొలువైన శ్రీ భూ నీళా సమేత శ్రీ వరద రాజస్వామివారి బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం నిత్య హోమం, బలిహరణ, భేరిపూజ, ధ్వజారోహణము, నవకుంభారోపణం, రాత్రి నిత్య హోమం, బలిహరణ, యారోత్సవం, హారతి కార్యక్రమాలు జరిగాయి. సోమవారం స్వామి వారిని పెండ్లి కుమారునిగా అలంకరించారు. రాత్రి నిర్వహించిన పూజా కార్యక్రమాలను వేద బ్రాహ్మణులు శాస్త్రయుక్తంగా నిర్వహించారు. దేవాలయ కార్యనిర్వాహణాధికారి ఇ. సాంబశివరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

రేపల్లె రూరల్: 2024–25 సంవత్సరానికి సంబంధించి బీసీ వార్షిక ప్రణాళికలో భాగంగా బీసీ, కాపు, ఈడబ్ల్యూఎస్, ఉపకులాలైన కమ్మ, రెడ్డి, క్షత్రియ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ వర్గాలకు చెందిన పేదలకు స్వయం ఉపాధి పథకానికి సంబంధించిన మినీడైరీ, గొర్రెల పెంపకం, ఆటో రిక్షాలు, చిన్న పరిశ్రమలు వంటి పథకాలకు, జనరిక్ మందుల షాపు తదితరాల ఏర్పాటుకు ప్రభుత్వ సబ్సిడీ, బ్యాంక్ లోనుతో ఏర్పాటు చేసుకునేందుకు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 21 నుంచి 60 సంవత్సరాల మధ్య అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో (ఓబీఎంఎంఎస్ పోర్టల్‌లో) ఈ నెల 22వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సచివాలయాలలోగాని, మీ సేవా సెంటర్లలోగాని దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకై మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

- **కొల్లూరు:** బ్యాంకు లింక్ రాయితీ రుణాలకు ఈనెల 22 లోపు దరఖాస్తు చేసుకోవాలని కొల్లూరు ఎంపీడీఓ కె.నరసింహారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని బీసీ, ఈడబ్ల్యూఎస్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా బీసీ కులాలకు–18, కాపు కులస్తులకు–26, ఈడబ్ల్యూఎస్ – 61 కలిపి మండలంలో 105 మందికి కుట్టుమిషన్లు కేటాయించినట్లు తెలిపారు. అర్హులైన లబ్ధిదారులు గ్రామ సచివాలయాలు, నెట్ సెంటర్లలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

చెరుకుపల్లి: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 12వ తేదీ బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ మత్తి దివాకర రత్న ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించబడుతుందని ఎంపీడీఓ షేక్ మహబుబ్ సుభాని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పలు సమస్యలపై చర్చించటం జరుగుతుందని, మండలంలోని ప్రజా ప్రతినిధులు, మండల, గ్రామ స్థాయి అధికారులు అందరూ తప్పని సరిగా సమావేశానికి హాజరు కావాలని కోరారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

చెరుకుపల్లి: యువత ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని స్థానిక ఎస్ఐ టి.అనీల్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. మండల పరిధిలోని గూడవల్లి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మంగళవారం యువతకు ఈవ్ టీజింగ్, చెడు అలవాట్లు, సైబర్ నేరాలు, బైక్ రైడింగ్, హెల్మెట్ ఉపయోగం పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.శ్యాంప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

నిజాంపట్నం: మహిళలు, బాలికల సంరక్షణకై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ తిరుపతిరావు అన్నారు. మండలంలోని ఆముదాలపల్లి గ్రామంలోని ఎంపీయూపీ స్కూలులో శక్తియాప్‌పై విద్యార్థినులకు మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. బాలికలు, మహిళల ఆపదలో ఉంటే శక్తియాప్ ద్వారా పోలీసులకు సమాచారం అందిస్తే వెంటనే పోలీసులు ఆ ప్రదేశానికి చేరకుని రక్షణ కల్పిస్తారన్నారు. బాలికలు ఈవ్ టీజింగ్‌లకు గురైనా, దుండగుల నుంచి రక్షణ కోసమైనా ఈ యాప్‌ను ఉపయోగించాలన్నారు. ఈ సందర్భంగా శక్తి యాప్‌ను ఫోన్‌లలో డౌన్‌లోడ్ చేసుకుని ఉపయోగించే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

క్రమం తప్పక సమావేశాలు నిర్వహించాలి

భట్టిప్రోలు: ప్రతి స్వయం సహాయక సంఘం, క్రమం తప్పని సమావేశాలు నిర్వహించాలని మండల సమాఖ్య కార్యనిర్వాహక సభ్యులు మంగళవారం తీర్మానించారు. స్థానిక భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో అధ్యక్షురాలు జాలాది ధనలక్ష్మి అధ్యక్షతన స్వయం సహాయక సంఘాలకు మూడు రోజుల శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ ఉద్దేశం కార్యక్రమంలో భాగంగా సంఘం లేని పేదలందరిని సంఘాలలో చేర్పించాలని ఆర్థిక వ్యవహారాలతో పాటు సామాజిక అంశాలలో కూడా మహిళలు చురుకుగా పాల్గొనాలని పేర్కొన్నారు. ఏపీఎం జి.శ్రీమన్నారాయణ కార్యక్రమం నిర్వహించారు. వేమూరు క్లస్టర్ ఏసీ ఎం.రమేష్‌బాబు, సీసీలు హనోక్, రజని, నరేంద్ర, అకౌంటెంట్ బి.శిరీష, మండల సమాఖ్య ఈసీ సభ్యులు పాల్గొన్నారు.